# తెగింపు

**- కె. మధుసూదన్**



ఈ రోజుల్లో తెగింపు సర్వ సాధారణమైంది. పిల్లల నుండి పెద్దల వరకు ఏదో ఒక విషయంలో తెగిస్తున్నారు. పరీక్షల్లో ఫేలేతే కొంతమంది పిల్లలు తెగింపుతో ఆత్మహత్య చేసుకుంటున్నారు. ప్రేమ విఫలమైతే ప్రేమికులు తెగించి ఆత్మహత్య చేసుకుంటున్నారు. వివాహేతర సంబంధాలు బయటపడగానే! అతనితో ఆమె, ఆమెతో అతను తెగింపుతో వెళ్లే ధైర్యం లేక హింసలకు చిత్రహింసలకు మరెన్నో ఇక్కట్లకు గురౌతున్నారు. కొంతమంది స్త్రీలు నాలుగు గోడల మధ్య ఎన్నో హింసలకు మరెన్నో ఇక్కట్లకు గురౌతారే తప్ప తెగించి బయటికొచ్చి స్వేచ్ఛగా బ్రతకలేకపోతున్నారు. కొంతమంది ధైర్యంతో అన్ని విషయాల్లో తెగించి, మంచి, చెడూ రెండు ఫలితాలు అనుభవిస్తారు.

మరికొంత మంది ఏ విషయంలో తెగించ లేరు. ఒకవేళ తెగించాలని వారనుకున్నా! పిరికితనం అడ్డువస్తూ! తెగింపు లేకుండా చేస్తుంది.

తెగింపు అన్ని విషయాల్లో పనికిరాదు. కొన్ని విషయాల్లో మాత్రమే పనికొస్తుంది. ప్రతి విషయంలో తెగిస్తే ప్రమాదమే! అనర్థమే!

ఓ విషయంలో నా శిష్యురాలు వసంత ధైర్యంగా తెగించింది. ధైర్యంగా తెగించి ధైర్యంగా జీవిస్తోంది.

ఆ వైనం తలచుకోగానే నాలుగు సంవత్సరాల గతంలోకి వెళ్లాను. నాలుగు సంవత్సరాల గతం నా కళ్ల ముందు సినిమాలో రీళ్ల లాగా తిరగసాగాయి.

ఒకనాడు బస్‌స్టాండ్‌లో నిల్చొని సిటీ బస్సు కొరకు ఎదురుచూస్తూ ఆలోచనల్లో మునిగిన నేను మాష్టారూ! నమస్తే! అన్న కోమల కంఠస్వరం విన

బడడంతో నా ఆలోచనలకు స్వస్తి చెప్పి అటువైపు తిరిగి చూశాను. నేను తిరిగి చూడడంతో ఆ యువతి నమస్తే మాష్టారూ! అంటూ తిరిగి నాకు నమస్కరించింది.

నేను తిరిగి నమస్కరిస్తూ! మీరు అంటు సంశయంతో ఆగిపోయాను. దానికామ్మె మాష్టారూ... మీరు నన్ను గుర్తించ లేదా? నేనండి వసంతను. మీరు కరీంనగర్‌లో టీచర్‌గా పనిచేసేటపుడు మీ శిష్యురాలినండి. పది సంవత్సరాల క్రితం మీ ఇంటి ప్రక్కనే ఉండి, ప్రతి రోజు మీ ఇంటికొచ్చి మీ అమ్మాయి లిద్దరు సునంద, సురేఖలకు సన్న జాజి పూలు తెచ్చి ఇచ్చే ఆ వసంతనండి. అని మరికొన్ని జ్ఞాపకాలు జ్ఞప్తికి తేవడంతో లీలగా అవి గుర్తుకొచ్చి ఆనందంతో అమ్మా వసంతా బాగున్నావా? ఎంతకాలమైందమ్మా నిన్ను చూచి? అమ్మా నాన్న బాగున్నారా? వివాహమైందా? పిల్లలెంత మంది? మీ వారేం చేస్తున్నారు? తల నిమురుతూ ఆప్యాయంగా ప్రశ్నించాను.

దానికి వసంత అమ్మా నాన్న అందరు బాగున్నారు మాష్టారూ! వయస్సు మీద పడడంతో అమ్మ బిపీతో, నాన్న సుగర్‌తో బాధపడుతున్నారు. మా చెల్లెలు రమకు క్రితం సంవత్సరమే వివాహమైంది. ప్రస్తుతానికి నాకు పిల్లలు లేరు. శ్రీవారు చిన్న వ్యాపారం చేస్తున్నారు.

మాష్టారూ! సురేఖ, సునంద బాగున్నారా? వారేం చేస్తున్నారు? అని ప్రశ్నించింది.

సునంద బిఇడి చేసి రాజమండ్రిలో టీచర్‌గా పనిచేస్తోంది. దాని భర్త అక్కడే లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. దానికిద్దరు పిల్లలు. పదిహేను రోజుల క్రింత వచ్చి వెళ్లింది.

సురేఖకు ఒక బాబు. అది బ్యాంక్‌లో పని చేస్తోంది. దాని భర్త విశాఖపట్నంలో ఇంజనీయర్ దానికో బాబు.

దేవుని దయవల్ల అందరు చల్లగా ఉన్నారు. నేను రిటైరై ఐదు సంవత్సరాల క్రితం ఇక్కడనే స్థిరపడ్డాను రామా, కృష్ణా అనుకుంటూ.

అడగడం మరిచాను. నీకో తమ్ముడు ఉండాలి గదూ! అతనేం చేస్తున్నాడు? అడిగాను.

వాడి పేరు రఘు మాష్టారూ! తండ్రి దారిలోనే నడుస్తున్నాడు. నాన్నగారు వ్యాపారంలోని రహస్యాలు తెలుపడంతో తెలివిగా వ్యాపారం చేసుకుంటున్నాడు.

చాలా మంచి పని చేస్తున్నాడు. వ్యాపారాన్ని జాగ్రత్తగా గమనిస్తూ... చేసుకుంటు పోతుంటే! దానికి మించింది ఏది లేదు. స్వతంత్రే స్వర్గలోకే అన్నారు పెద్దలు. ఉద్యోగం కంటే ఇదే వందరేట్లు నయమమ్మా! ఒకరి చేతి క్రింద బ్రతకవలసిన పనిలేదు. స్వతంత్రంగా జీవించవచ్చు. అని ప్రశంసిస్తూ అన్నాను. ఇంతలో బస్సు రావడం గమనించి వసంత 'మాష్టారూ! మీ అడ్రసిస్తే! మీ ఇంటికొచ్చి అన్ని వివరాలు వివరంగా చెబుతానంటు నా అడ్రసు తీసికెళ్లింది.

ఆ రోజు తీరుబడిగా ఇంట్లోనే కూర్చొని పేపర్ తిరిగేస్తుండగా కాలింగ్ బెల్ మ్రోగడంతో వెళ్లి తలుపు తీశాను. ఎదురుగా వసంత నిలబడి ఉంది. నన్ను చూచి వినయంగా నమస్కరించింది. నేను సగౌరవంగా లోనికి ఆహ్వానించాను. ఇంతలో పూజ ముగించుకొని తీర్థప్రసాదాలు నా కందిస్తూ! వసంతను చూచి ఎవరండీ ఈ అమ్మాయి? అని ప్రశ్నించింది నా భార్య మీనాక్షి. దానికి నేను ఈ అమ్మాయి ఎవరో తెలుసా? పది సంవత్సరాల క్రితం నేను కరీంనగర్‌లో పనిచేసేటప్పుడు మన ఎదురింట్లో ఉండే శెట్టిగారి అమ్మాయి పేరు వసంత. మన అమ్మాయిలతో ఎంతో స్నేహంగా ఉండేది. బహుశా నువ్వు మరిచిపోయి ఉండవచ్చు అన్నాను. దాంతో నా భార్య ఓ నిమిషం ఆలోచనల్లో పడి, అంతలోనే ఏదో గుర్తుకొస్తున్నట్లుగా మీ నాన్నగారి పేరు సోమిశెట్టి, అమ్మ పేరు సుశీల గదూ! దానికి వసంత ఔనన్నట్లుగా తల ఊపుతూ మా ఆవిడ కాళ్లకు వంగి నమస్కరించింది.

అప్పటి కబుర్లు ఎన్నో చెప్పి మళ్లీ వెళ్లి వస్తానంటు మా నుండి సెలవు తీసుకుంది. ఇలా ఒక సంవత్సరం కాల గర్భంలో కలిసిపోయాయి. ఈ సంవత్సర కాలంగా వసంత మాకెంతో నచ్చి, మా కెంతో దగ్గరైంది మా అమ్మాయిలు దగ్గరిలో లేని లోటు వసంత వల్ల తీరింది.

వసంత గూడా మమ్మల్నెంతో గౌరవించేది. తమ ఆత్మీయులుగా తలచేది. మరో రెండు నెలలు కాల గర్భంలో కలిసిపోయాయి.


తరుచుగా చాలాసార్లు మా ఇంటికొచ్చే వసంత ఎందుకో ఏ కారణం వల్లో ఇరువై రోజుల నుండి మా ఇంటికి రాకపోవడంతో నేనెంతో ఆందోళన చెందాను. ఎందుకు రావడం లేదు? అనుకోకుండా ప్రయాణం మరో ఊరికి కావలసి వచ్చిందా? లేక ఏదైనా సుస్తీచేసి రావడానికి కుదరలేదా? నా మనసు పది పది విధాల ఆలోచించ సాగింది. మరో రెండు రోజులు ఎదురు చూచి ఇక ఉండబట్టలేక వాళ్లింటికెళ్లాను. కాని వారి నుండి సంతృప్తికరమైన సమాధానం రాబట్టలేకపోయాను. క్రమంగా ఆ విషయం మరిచి పోయాను.

సంవత్సరం తర్వాత ఓ విషయం ఒకరి ద్వారా నా చెవిన పడింది. నేనెంతో ఆశ్చర్యపోయాను. కొంత విస్మయం చెందాను గూడా! ఆ విస్మయం చెందిన వార్త ఏమిటంటే?

తన భర్తవల్ల తను మాతృత్వం పొందలేనని, అతని వల్ల తను మాతృత్వం పొందే అర్హత పూర్తిగా కోలుపోయానని, తనకు మాతృవాంఛ ప్రగాఢంగా ఉండడంతో సంఘము, సమాజము కట్టుబాట్లకు నీతినియమాలకు విడాకులిచ్చి, ధైర్యంగా ఓ విధమైన తెగింపుకొచ్చి, అన్ని అర్హతలున్న ఓ యువకునితో వెళ్లి మాతృత్వం పొంది, సంతానవతై అతనితో జీవిస్తోందని.

శ్రీమతి భోజనానికి పిలవడంతో ఆలోచనలకు స్వస్తి చెప్పి డైనింగ్ హాల్ వైపు నడిచాను. ❋

## "ట్రెండ్ మార్చిన శ్రీహరి"



"ఒరేయ్ తమ్ముడు" చిత్రం డిజపాయింట్ చెయ్యడంతో శ్రీహరి ట్రెండ్‌ని పూర్తిగా మార్చుకున్నాడు. తాజాగా సారధి ప్రొడక్షను వారి పేరు పెట్టని చిత్రం షూటింగ్‌లో శ్రీహరిని చూశాను. శ్రీహరికి జనంలో ముఖ్యంగా మాస్‌లో ఫాలోయింగ్ వుంది. ఇటీవలనే లేడిస్‌లో కూడా ఫాలోయింగ్ ఏర్పడింది. అయితే ఈ మధ్య విడుదలయిన ఒకటి రెండు సినిమాలు డిజపాయింట్ చెయ్యడంతో ఆడియన్స్‌లో అతని ఫాన్సులో అసంతృప్తి బయల్దేరింది. ఇదే విషయం ప్రస్తావిస్తుండగా...

"ఇది సహజం! మారుతున్న ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా మనమూ మారాలి. కథలూ... కథనాలు... ప్రెజెంటేషన్స్ అన్నీ మారాలి. టోటల్‌గా ఓ డిఫరెంట్ షేడ్‌లో కనిపించడానికి చేసే ప్రయత్నమే ఈ సారధి ప్రొడక్షన్స్ చిత్రం అన్నాడు, స్థిర సంకల్పంతో.